
ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు
5
మంగళవారం 26 నవంబరు 2024

హైకోర్టు బెంచ్ కర్నూలులో పెడుతున్నాం: మంత్రి భరత్



న్యాయవాదులతో మంత్రి భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో మాటిచ్చిన విధంగానే సీఎం చంద్రబాబు కర్నూల్లోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని మంత్రి కార్యాలయంలో కర్నూలు బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు మంత్రి భరత్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం ఒకటి తర్వాత ఒకటి నెరవేర్చుతున్నారన్నారు. మంత్రిని బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ క్రిష్ణమూర్తి, రవిగువేరా, జహంగీర్ బాషా, గణేష్ సింగ్, ఓంకార్, శాంతకుమార్, అయ్యస్వామి, తేజస్విని తదితరులు కలిశారు.

నా నిజాయితీపై బాబుకు నమ్మకం

- ఎమ్మెల్యేలందరూ నన్ను ఆశీర్వదించాలి
- ప్రమాణ స్వీకారోత్సవంలో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తన నిజాయితీపై చంద్రబాబుకు నమ్మకం ఉన్నందున మరోసారి కుడా చైర్మన్ బాధ్యతలు అప్పగించారని సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని ఎంఆర్సీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబును తాను అన్నా అని సంబోధిస్తానని, పార్టీకి స్థాపించినప్పటి నుండి అధికార, ప్రతిపక్షాల్లో ఎక్కడ ఉన్నా రాష్ట్ర స్థాయిలో తాను ఎన్నో కార్యక్రమాలు చేపట్టి నిజాయితీగా సేవలు అందించానని అన్నారు. తాను ఊహించని తీరులో పార్టీ మరోసారి తనకు సేవలందించే అవకాశం కల్పించడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా తనను కుడా చైర్మన్‌గా ఆశీర్వదించాలని కోరారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులకు అవకాశం కల్పించిందని, అందులో నీతిమంతుడైన ఎన్ఎండీ ఫరూక్‌కు న్యాయశాఖ కేటాయించారని, అలాగే టీజీ భరత్‌కు పరిశ్రమల శాఖ ఇచ్చి తగిన ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర ద్వారా పార్టీలో వర్గాలు, లోపాలు, కుమ్ములాటలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశారని, తనకు పదవి రావడం దాని కారణమే అని అన్నారు.

మిగతా 7లో



- నెలకు రూ.2 లక్షలు కప్పం కట్టాల్సిందే
- వ్యాపారం సక్రమంగా సాగాలంటే చెప్పినట్లు వినాల్సిందే
- మద్యం దుకాణం యజమానులపై ఒత్తిళ్లు
- అధికార పార్టీ కోటరీ సభ్యుడి కనుసన్నల్లో తతంగం
- మధ్యవర్తులుగా ఎక్సైజ్ శాఖ అధికారులు?
- డోన్ నియోజకవర్గంలో 'స్పెషల్ మద్యం పాలసీ'

మద్యంలో ముడుపుల వేట..!

నంద్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం మద్యం పేరిట దోపిడీ చేసింది. హోల్‌సేల్, రిటైల్ తయారీ వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పారదర్శకత తీసుకువచ్చింది. బెల్టు షాపులు పెడితే ఖబడ్దార్, బెల్టు తీస్తాం.. ఎమ్మెల్యేలు బెల్టు షాపులు లేకుండా చూసుకోవాలి'... ఇది మొన్నటి వరకు అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు నాయుడు బెల్టు షాపులపై వైఖరిని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో పెనుమార్పులు తీసుకొచ్చింది. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నాణ్యమైన మద్యాన్ని అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టింది. కానీ కొన్నిచోట్ల మాత్రం ప్రభుత్వ మద్యం పాలసీకి భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో మద్యం పాలసీ పాటించినా, పాటించకపోయినా పర్వాలేదు తమకు మాత్రం నెలకు రూ.2 లక్షలు కప్పం చెల్లించాలంటూ ఇక్కడి అధికార పార్టీలోని ముఖ్యనాయకుడి కోటరీ సభ్యుడు బేరసారాలకు తెరతీశాడు. ఈ మద్యం వ్యాపారంలో మధ్యవర్తిత్వం వహించేందుకు ఏకంగా అబ్కారీశాఖ అధికారులనే రంగంలోకి దింపుతున్నట్లు సమాచారం. ఇటు నాయకులు, అటు అధికారులు కుమ్మక్కై డోన్ నియోజకవర్గవ్యాప్తంగా 'స్పెషల్ మద్యం పాలసీ'ని అమలు చేస్తున్నారంటూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

16 మద్యం దుకాణాలు.. రూ.32 లక్షలు?



డోన్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం

గత ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తంగా తయారు చేయటంతో కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. కొత్తగా మద్యం పాలసీని తీసుకువచ్చి జిల్లాల వారీగా మద్యం దుకాణాలను కేటాయించింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గానికి 16 మద్యం దుకాణాలను కేటాయించింది. వీటిని జిల్లాలోని మిగతా షాపుల మాదిరిగానే లాటరీ విధానంలో ప్రైవేటు వ్యాపారులు దక్కించుకున్నారు. మద్యం దుకాణాల ద్వారా మాత్రమే సరుకును అమ్ముకుంటే పెద్దగా లాభం ఉండదని ఆయా దుకాణాల యజమానులు ఆలోచనలో పడ్డారు. ఇదే అదునుగా భావించిన నియోజకవర్గ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఆయా దుకాణాల్లో నాణ్యతలేని సరుకును అమ్ముకున్నా, ఇతర రాష్ట్ర సరుకును అమ్ముకున్నా చూసి చూడనట్లు వదిలేసి తద్వారా డబ్బులు దండుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఇందుకోసం ఒక్కో మద్యం దుకాణం నెలకు రూ.2 లక్షలు తమకు ముట్టజెప్పాలని హుకుం జారీ చేశారు. ఈ అక్రమ తతంగంలో సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు చెప్పినట్లుగా ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.2 లక్షలు, మొత్తం రూ.32 లక్షలు వసూలు చేసేందుకు డోన్ ఎక్సైజ్ శాఖకు చెందిన సీఐ స్థాయి అధికారి రంగంలోకి దిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా 6లో..

విచారణ జరిపి న్యాయం చేస్తాం

ఎస్పీ బిందు మాధవ్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ జి. బిందు మాధవ్ అన్నారు. స్థానిక ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 107 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ ఇబ్రహీం పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో హోం మంత్రి అనిత

6

గంజాయి మొక్కలు స్వాధీనం

7

విద్యార్థి ఆత్మహత్య

అంకిరెడ్డిపల్లెలో విషాదం..



మధ్యాహ్నం 12 గంటల సమయంలో టోకెన్ కోసం వేచి చూస్తున్న రోగులు

ఓపీ కోసం రోగుల అవస్థలు

రెండు సార్లు మొరాయించిన సర్వర్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ టికెట్ల కోసం రోగులు బారులు తీరారు. సోమవారం కావడంతో సాధారణ రోగులు ఓపీ కోసం అధిక సంఖ్యలో వచ్చారు. కొత్త, పాత రోగులు కలిసి మూడు వేల మంది వచ్చారు. నర్సింగ్ సూపరింటెండెంట్ల దగ్గర టోకన్ తీసుకుని కౌంటర్ల వద్దకు వెళ్లి ఓపీ టికెట్ తీసుకోవాలి. అయితే.. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సర్వర్ మొరాయించింది. ఓపీ టికెట్లు అందక రోగులు క్యూలైన్లలో పడిగాపులు కాశారు. సర్వర్ మొరాయించడంతో ఈ-హాస్పిటల్ ఆన్‌లైన్ ఓపీకి ఇబ్బందులు ఏర్పడ్డాయి. చివరకు సిబ్బంది చేతి రాతతో ఓపీ టికెట్లు ఇవ్వడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి సోమవారం ఓపీ కోసం రోగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆసుపత్రి అధికారులు ఏ మాత్రం ప్రత్యామ్నా చర్యలను చేపట్టకపోవడంతో వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు గంటల తరబడి వరుసల్లో నిలబడలేక నీరసించిపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

శ్రీగిరిపై లక్ష దీపోత్సవం

ఘనంగా పుష్కరిణికి దశ విధ హారతులు



లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించు కొని ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరణికి దశవిధ హారతులు కార్యక్రమా లను దేవస్థానం ఘనంగా నిర్వహిం చింది. చివరి సోమవారం కావడంతో క్షేత్ర వీధుల్లో భక్తుల రద్దీ కనిపించింది. వేకువ జామునుంచే పాతాళ గంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మం టపం వద్ద మహిళలు దీపాలు వెలి గించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశ దీపం వెలిగించారు.

- పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలకరించి పుష్కరణి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అట్లాగే పుష్కరిణికి వేదమంత్రోచ్ఛరణ నడుమ దశవిధ హారతులను నివేదించారు.

బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకూడదు

- అర్జీలను త్వరగా పరిష్కరించాలి
- జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఏ ఒక్క దరఖాస్తు కూడా బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జేసీ అధికారులతో సమీక్షించారు. ఎట్ టూ వ్యూకు సంబంధించి 93 అర్జీలు ఇంకా చూడాల్సి ఉందని, అందులో రెవెన్యూకు సంబంధించి 55 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వెంటనే అర్జీలు ఓపెన్ చేసి చూడాలన్నారు. అదే విధంగా పోలీసు శాఖకు సంబంధించి కూడా 30 అర్జీలు ఇంకా ఓపెన్ కూడా చేసి చూడలేదని సంబంధిత అధికారి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా రీ ఓపెన్ కేసులకు సంబంధించి రెవెన్యూలో 10, పోలీసుశాఖలో 5 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ఫీల్డ్ ఎంక్వైరీ చేసి సరైన ఎండార్స్‌మెంటు ఇవ్వాలని ఆదేశించారు. సీఎం గ్రీవెన్స్‌కు సంబంధించి జిల్లాలో 17 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జేసీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో పి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.





ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

అంధులకు వెలుగునిచ్చిన నేత్రదానం



శంకరయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ యోగా నిత్య సాధకుడు బొంతల శంకరయ్య ఆదివారం మరణించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీకీ ఫోన్ చేసి తన తండ్రి నేత్రాలను దానం చేస్తామని తెలిపారు. వెంటనే ఆనంద్‌గురూజీ రెడ్‌క్రాస్ ఛైర్మన్ దస్తగిరికి తెలిపారు. కర్నూలు నుండి టెక్నీషియన్లు వచ్చి రెండు నేత్రాలను సేకరించి హైదరాబాదు ఎల్వీ ప్రసాద్ నేత్రశాలకు పంపించారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బొంతల శంకరయ్యను, ఆయన కుమారుడ్ని ఆదర్శంగా తీసుకుంటే ఎందరో అంధులకు చూపు వస్తుందని అన్నారు.

మహానందిలో శివ నామస్మరణ

● చివరి సోమవారం భక్తుల రద్దీ ● వైభవంగా జల హారతి



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, జలహారతి ఇస్తున్న అర్చకులు

మహానంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):.మహానంది క్షేత్రం కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగింది. వేకువ జాముననే భక్తులు ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో కార్తీక పుణ్య స్నానాలను ఆచరించారు. క్యూలో రెండు గంటల పాటు నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలో పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. రాత్రి రెండో ప్రాకారంలోని కోనేరు వద్ద గంగాదేవికి జలహారతిని ఇచ్చారు.






ఆధ్యాత్మికం

ఆహ్లాదం ముచ్చట్ల ఆలయం

● ఇక్కడికి వస్తే శ్రీశైలానికి వెళ్లినట్లేనని నమ్మకం
● అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్

బేతంచెర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొండల నడుమ వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం పురాతన కాలం నాటిదని, భక్తులు శ్రీశైలానికి వెళ్లిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లినా ఒకటేనని భక్తుల ప్రగాఢ నమ్మకం. బేతంచెర్ల మండలం హెచ్ కొట్టాల గ్రామ సమీపంలోని కొండల మధ్య ఈ ఆలయం ఉంది. ముక్కోటి దేవతలు ముచ్చట్లాడి ప్రతిష్ఠించిన శివలింగమే ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అని పురాణ కథలు చెబుతున్నాయి. అయితే పురావస్తు శాఖ అధికారులు గానీ, దేవదాయ శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ఏడాది ఆలయ అభివృద్ధికి రూ.1.90 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులకు టెండర్లు పిలిచినా ఆలయ అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. కార్తీక మాసం, మాఘ మాసంలో మల్లికార్జున స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. గతంలో ఆలయానికి భక్తులు రావాలంటే హెచ్ కొట్టాల స్టేజీ నుంచి నడిచి వెళ్లేవారు. ప్రస్తుతం దేవాలయానికి వెళ్లడానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ కమ్మ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే మహా శివరాత్రి పండుగ సమయంలో భక్తుల రాకపోకలు, ఆర్యవైశ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఆటోలు ఏర్పాటు చేసి అల్పాహారంతోపాటు భోజన వసతి కల్పిస్తున్నారు. అయితే ఆలయ ప్రాంగణంలో వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఆలయ అభివృద్ధి నిలిచిపోయిందని తెలుపుతున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు వర్షానికి నిలిచిన నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత దేవదాయ శాఖ ఉన్నతాధికారులు పురాతన శైవ దేవాలయమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.



పురాతన ముచ్చట్ల ఆలయం ఇదే



ముచ్చట్లలోని కోనేరు

కోనేరు ఏర్పాటు చేసి నీరు నింపాలి



మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు స్నానాలు చేసేందుకు కోనేరు ఏర్పాటు చేసి నీటిని నింపాలి. భక్తులకు వసతులు ఏర్పాటు చేసి ఆలయాన్నిఅభివృద్ధి చేయాలి.

-నాగమోహన్
హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యుడు, బేతంచెర్ల



కొండల నడుమ వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం

గాలిగోపురానికి మరమ్మతులు చేపట్టాలి



పురాతన శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ గాలి గోపురానికి పురావస్తు శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టాలి. భక్తుల రాకపోకలు పెరిగాయి. ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. భక్తులకు అన్ని వసతులు కల్పించాలి.

- యోగేంద్రబాబు,
హెచ్.కొట్టాల

మల్లన్న సన్నిధిలో హోం మంత్రి



ఆలయ ప్రాంగణంలో హోం మంత్రి అనిత

శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న హోం మంత్రి అనితకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి అనితకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. దర్శనానంతరం మంత్రి అనిత ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహిస్తున్న లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమంలో పల్గొన్నారు. అంతకముందు భ్రమరాంబిక అతిథిగృహం వద్దకు చేరుకున్న హోంమంత్రి అనితకు ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

శీతల బేస్ క్యాంపు పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీపీటీ

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో సోమవారం నాగార్జున టైగర్ ప్రాజెక్టు ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి పర్యటించారు. రెవెన్యూ పరిధిలోని శీతల బేస్‌క్యాంపును తనిఖీ చేసి వైర్‌లెస్ సెట్‌ను, వాకీటాకీలను పరిశీలించారు. రుద్రవరం డివిజన్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాలను, కలప డిపోను, గెస్ట్‌హౌస్ భవనాన్ని పరిశీలించారు. అటవీ సంరక్షణ పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, బీట్ ఆఫీసర్ నాగహుసేనయ్య పాల్గొన్నారు.

మద్యంలో ముడుపుల వేట..!



డోన్‌లోని మద్యం దుకాణం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను సెబ్‌లో విలీనం చేయటంతో అక్రమ మద్యం, బెల్టు షాపులపై నియంత్రణ సరిగా లేకుండా పోయింది. దీనిని కట్టడి చేయాలంటే ఎక్సైజ్ శాఖను మళ్లీ ప్రత్యేకంగా ఉంచాలని కూటమి ప్రభుత్వం భావించి, అదే విధంగా చేసింది. ఎక్సైజ్ శాఖను మళ్లీ పాత పద్ధతిలోనికి తీసుకురాగానే సంబంధిత అధికారులు గతంలో మాదిరి ప్రవర్తిస్తూ ఆయా నియోజకవర్గ నాయకులు చెప్పినట్లు వినడం మొదలుపెట్టారన్న విమర్శలున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే డోన్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకుడి అనుచరులు మద్యం దుకాణాల నుంచి రూ.2 లక్షలు వసూలు చేయాలని చెప్పారో లేదో... ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారి అలా పావులు కదపడం మొదలు పెట్టారు. సదరు అధికారి నియోజకవర్గ ముఖ్య నాయకుడికి, మద్యం దుకాణాల యజమానులకే కాకుండా, మద్యం దుకాణం, బెల్టు షాపు యజమానులకు కూడా అనుసంధానకర్తగా ఉంటున్నాడని సమాచారం. మద్యం దుకాణాల ద్వారా ఇతర సరుకును అమ్ముకోవటమే కాకుండా, బెల్టు షాపులను ఏర్పాటు చేసుకోవచ్చంటూ ఉచిత సలహా పడేస్తున్నాడు. ఆయా మద్యం దుకాణాల పరిధిలో బెల్టు షాపుల నుంచి ఎంత వసూలు చేస్తారు? బెల్టు షాపులకు నెలకు ఎంత సరుకు అమ్ముకుంటారు? అనేది సంబంధం లేదు. కానీ నెలకు రూ.2 లక్షలు మాత్రం ముట్టజెప్పాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. తాను చెప్పినట్లు చేయకపోతే మద్యాన్ని అమ్ముకోలేరని, ఆ తర్వాత ఇబ్బందులు పడతారని మద్యం దుకాణ యజమానులను బెదిరించినట్లు సమాచారం. సదరు అధికారి తీవ్ర ఒత్తిడి తీసుకువస్తుండటంతో బెంబేలెత్తిపోయిన మద్యం దుకాణదారులు నెలకు రూ.2 లక్షలంటే తమ వల్ల కాదని, నెలకు రూ.50 వేల చొప్పున 16 దుకాణాల నుంచి రూ.8 లక్షలు ఇచ్చుకోగలమని బేరానికి వచ్చినట్లు సమాచారం. దీనిపైన ఇంకా ప్రతిష్ఠంబన వీడలేదు.

ఎందుకిలా..?

మద్యం దుకాణాల లాటరీ సమయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సిండికేట్లు నడిచినా, డోన్ నియోజకవర్గంలో సిండికేట్ నడవలేదు. ఇక్కడ దుకాణాలు దాదాపు టీడీపీ వారికే దక్కాయి. ఒకటి రెండు చోట్ల వేరే వారికి దుకాణాలు లాటరీలో తగిలినా, వారు గుడ్‌విల్ ఇచ్చి ఇతరులకు అమ్ముకున్నారు. దీనివల్ల ఇక్కడి ముఖ్యనేతలకు పెద్దగా డబ్బు పరంగా పెద్ద ప్రయోజనం లేకుండా పోయింది. ఆయా దుకాణం నుంచి నెలకు ఫిక్స్‌డ్‌గా ఇంత అని వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎలాంటి ప్రయోజనం చూపించకుండా నెలకు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పమంటే వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనలో ఇక్కడి నాయకులు పడ్డారు. మద్యం అమ్మకాల విషయంలో పట్టువిడుపుల చూపటమే కాకుండా, పరోక్షంగా బెల్టు షాపులకు సహకరిస్తే తాము అడిగినంత ఇస్తారన్న నిర్ణయానికి వచ్చారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతల కోటరీ నాయకుడు సాగిస్తున్న మద్యంలో ముడుపుల వేట ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

మద్యం పాలసీని ఉల్లంఘిస్తే చర్యలు

ప్రభుత్వం మద్యం పాలసీని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇక బెల్టు షాపుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉంది. సీఎం చంద్రబాబు కూడా బెల్టు షాపులు నిర్వహించేవారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. అలా కాదని జిల్లాలో ఎవరైనా బెల్టు షాపులకు సహకరిస్తూ మద్యం సరఫరా చేసినట్లు తెలిస్తే సంబంధిత మద్యం దుకాణాదారులకు మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా, రెండోసారి పట్టుబడితే దుకాణాన్ని మూసివేస్తాం. బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే 80088 28467 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

-రవికుమార్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి, నంద్యాల

జర్నలిస్టులను బెదిరించడం దారుణం

● పిల్లల స్కూల్ ఫీజులో 60 శాతం రాయితీ ఇవ్వాలి ● జేసీ, ఎస్పీకి జర్నలిస్టుల వినతి పత్రాలు



జేసీకి వినతి పత్రం ఇస్తున్న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, అక్రమాలపై వార్తలు రాస్తే ఫిర్యాదులు చేసి జర్నలిస్టులను బెదిరించడం దారుణమని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్లూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు హరికిషణ్, సురేష్, సుంకన్న, ఖలీల్, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాశ్, వెంకటేశ్ అన్నారు. జేసీ డా.బి.నవ్య, ఎస్పీ జి.బిందుమాదవ్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల పత్తికొండ పట్టణంలో పలు లాడ్జీలు, డాబాలలో పేకాటాడుతున్నట్లు జర్నలిస్టులకు సమాచారం వచ్చిందని, ఆ మేరకు రిపోర్టర్లు వార్తలు రాశారని చెప్పారు. ఈ వార్తల్లో ఓ అధికారి అండతో ఆడుతున్నారని రాశారని, అయితే తన పరువుకు భంగం కలిగిందని, ఒక్కో రిపోర్టర్‌పై రూ.50 లక్షలకు పరువు నష్టం దావా వేస్తానని బెదిరించారని చెప్పారు. పైగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. అలాగే ఆదోనిలో అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైందని, అయితే రిపోర్టర్‌పై టీడీపీ నాయకురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు నమోదు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

ఫీజులో రాయితీ ఇవ్వాలి

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 60 శాతం రాయితీ ఇచ్చేలా అధికారులు సర్క్యులర్ జారీ చేయాలని జర్నలిస్టులు కోరారు. దీనిపై స్పందించిన జేసీ, డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను పిలిచి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సర్క్యులర్ ఇస్తామని డీఈవో చెప్పారు. జేసీని కలిసిన వారిలో ఎమ్మిగనూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయుడు, నాయకులు రామయ్య, భాస్కర్, మురళి, రంగ, మల్లికార్జున, చాంద్, గంగాధర్, ఫొటోగ్రాఫర్ రఫీ, కెమెరామెన్లు రాజు, రఫీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల సౌకర్యార్థం కూరగాయల మార్కెట్'



పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం

మద్దికెర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలోని మెయిన్‌బజారులో ప్రజల ఇబ్బందులను గుర్తించి నాబార్డు నిధులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేయడం జరిగిందని జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మెయిన్‌బజారులో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే మార్కెట్లు కూడా నాబార్డు ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మద్దికెరలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌కు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి రూ.3 లక్షలు విరాళం ఇచ్చారని, మరో రూ.15 లక్షలు నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయడంతో నవ యూత్ అసోసియేషన్ వారు నిర్మాణం చేపడుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు మాజీ ఉప సర్పంచ్ వి.నాగేశ్వరరెడ్డి, పంచాయతీ సభ్యులు రామాంజనేయులు, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడిపై భాను కిరణాలు

ఆధ్యాత్మికతతో ఓలలాడిన దుర్గా భోగేశ్వరం



దుర్గాభోగేశ్వరుడ్ని తాకుతున్న సూర్య కిరణాలు

గడివేముల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ప్రభాత భానుడి లేలేత కిరణాలు.. పచ్చని చెట్ల మధ్యలో నుంచి ఆలయ గర్భగుడిలోని దుర్గాభోగేశ్వరునిపై ప్రసరించడం ఈ దేవస్థానం ప్రత్యేకత. ఈ దృశ్యం చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ అద్భుత సంఘటన నంద్యాల జిల్లాలోని గడివేముల మండలం గడిగరేవుల గ్రామ పరిధిలో వెలసిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం ఆవిష్కృతమైంది. జనమేజయ మహారాజు కాలంలో నిర్మించిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏడాది కార్తీక మాసంలో దుర్గాభోగేశ్వరునిపై సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. సూర్యకిరణాలు ప్రసరించే సమయంలో పూజలు నిర్వహిస్తే పుణ్యఫలాలు దక్కుతాయని ఆలయ అర్చకులు శ్యాంసుందర్ శర్మ తెలిపారు. సోమవారం ఉదయం 6.55 గంటల నుంచి 7.05 గంటల వరకు దుర్గాభోగేశ్వరునిపై సూర్యకిరణాలు ప్రసరించాయి.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి ప్రజాధనం కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదాని లాంటి సంపన్నుల కోసం పేద మధ్యతరగతి ప్రజలు, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలపై వేలకోట్ల భారం వేశారని సోమవారం విద్యుత్‌భవన్ ముందు ధర్నాకు దిగారు. పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ చేపట్టి ధర్నాకు దిగారు. నాయకులు మాట్లాడుతూ గత నెలలో ప్రకటించిన రూ.6 వేల కోట్లతో సహా 11,820 కోట్ల ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల ధర్నా

రాష్ట్రంలో జరిగే అవినీతి ఇతర దేశాలు చెప్పే వరకు మన పాలకులకు నిఘావర్గాలకు తెలియక పోవడం బాధాకరమన్నారు. ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి కూటమి ప్రభుత్వం మాటపై నిలబడాలని చాంబర్ ఆఫ్ కామర్స్, పెట్రోల్ బంక్ యజమానుల సంఘం, మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్, చిన్న తరహా వ్యాపారుల సంఘం, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు విద్యుత్ శాఖ టెక్నికల్ గీఈ ఓటులేసుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్, ఎం.యాకో, అన్వర్‌బాషా, ఖలీల్‌అహమ్మద్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, తిరుపతయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నా నిజాయితీపై బాబుకు నమ్మకం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

(5వ పేజీతరువాయి

యువకుడైన టీజీ భరత్ పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి తగిన గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కేఈ క్రిష్ణమూర్తి, ఫరూక్, తాను పార్టీ కోసం ఎన్నో కార్యక్రమాలు చేశామని, ఆ క్రమంలోనే తమకు పార్టీ గుర్తింపు ఇస్తోందని అన్నారు. పార్టీని నమ్ముకుని ప్రతి ఒక్కరూ పని చేస్తూ పోవాలని, పదవులు వాటంతట అవే వస్తాయని తెలిపారు. జిల్లాలో కూడా 279 నాన్ లే అవుట్ వెంచర్లు ఉన్నాయని, వాటన్నిం టిని క్రమబద్ధీకరించి ప్రభుత్వాదాయం పెంచేదిశగా కార్యాచరణ రూపొందిస్తానని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలను మోసగించినవారి భరతం పడతామని హెచ్చరించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల నాయకులు కార్యకర్తలు గజమాలలు, బొకేలు, పూల కుండీలతో సోమిశెట్టిని సన్మానించారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, మీనాక్షినాయుడు, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వారసులతో కూడా కలిసి రాజకీయాలు చేస్తున్నాం- ఎన్ఎండీ ఫరూక్, మంత్రి

గతంలో టీడీపీ నాయకులు బీవీ మోహన్‌రెడ్డి, కేఈ క్రిష్ణమూర్తి, టీజీ వెంకటేశ్‌లాంటి నాయకులతో కలిసి పని చేశాం. నేడు వారి వారసులు బీవీ. జయనాగేశ్వరరెడ్డి, టీజీ భరత్, కేఈ శ్యామ్ బాబు లాంటి యువకులతో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. అప్పట్లో మేమంతా కలిసి జిల్లా కేంద్రం కర్నూలులో పార్టీ కార్యాలయాన్ని సొంతంగా నిర్మించుకున్నాం. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఊరికో కార్యాలయం కడుతోంది. రాజకీయాల్లో విలువలను చంద్రబాబు నేర్పించారు. అందుకే మరోసారి నాకు, సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు సేవ చేసే అవకాశం కల్పించారు.

మా కుటుంబంలో మరొకరికి పదవీ వచ్చినంత అనందంగా ఉంది: మంత్రి టీజీ భరత్

మా కుటుంబంలో మరొకరికి పదవి వచ్చినంత ఆనందంగా ఉంది. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనను సోమిశెట్టి ఎదిరించి, ధైర్యంగా కేసులను కూడా లెక్క చేయకుండా పార్టీ కోసం కష్టపడ్డారు. ఆయన సేవలకు గుర్తింపుగా నేడు కుడా చైర్మన్ బాధ్యతలు పార్టీ అప్పగించింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం హైకోర్టు బెంచ్ ప్రకటించింది. హామీ నెరవేర్చే క్రమంలో పార్టీ కోసం కష్ట పడ్డ వారందరికీ చంద్రబాబు పదవులు ఇస్తున్నారు. అందరికీ న్యాయం చేస్తున్నారు. దీనికి నేడు జిల్లాకు వరించిన పదవులే నిదర్శనం.

పార్టీకి వన్నె తెచ్చిన నాయకుడు సోమిశెట్టి: కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే పత్తికొండ

పార్టీకి వన్నె తెచ్చిన నాయకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు. యువతతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులకు నిత్యం నిర్దేశం చేస్తూ పార్టీకి పెద్దదిక్కుగా సేవలందిస్తున్నారు. యువత ఆదర్శంగా తీసుకుని పార్టీ కోసం పని చేయాలి.

ఉమ్మడి జిల్లాకు ఎప్పటికీ అధ్యక్షుడే: బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే శ్రీశైలం

సోమిశెట్టి ఎప్పటికీ ఉమ్మడి జిల్లాకు అధ్యక్షుడిగానే ఉండాలని కోరుకుంటా. మరోసారి కుడా చైర్మన్‌గా ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు రాజకీయాలతో పాటు, పాలనలో కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉంది.

మా నాన్న లేరన్న బాధ కనిపిస్తోంది- జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

వేదికపై నాన్నతో కలిసి పని చేసిన వారందరూ ఉన్నారు. పార్టీ కోసం శ్రమించిన తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి వేదికపై లేకపోవడం బాధగా ఉంది, చంద్రబాబు నాయకత్వంలో సీనియర్లు పార్టీకి ఎంతో సేవలు అందించారు. అందులో ప్రతి ఒక్కరం వారిని ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధి కోసం పని చేస్తాం.



సోమిశెట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి టీజీ భరత్

చాలెంజ్‌గా తీసుకుని పని చేశారు: బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

సోమిశెట్టి వెంకటేశ్వర్లు చాలెంజ్‌గా తీసుకుని ప్రతి కార్యక్రమం నిర్వహించారు. అందుకు తగ్గట్టుగా ఫలితాలు అయన తీసుకుంటున్నారు. అందరూ ఆయన అడుగు జాడల్లో నడిచి పార్టీ కోసం పని చేయాలి.

పదవుల కోసం కాదు .. పార్టీ కోసం పని చేయాలి: తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పదవుల కోసం కాకుండా పార్టీ కోసం పని చేయాలి. సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలి. రాష్ట్రంలో ఏ జిల్లాకు రాని చైర్మన్లు, కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదవులు మన జిల్లాకు వచ్చాయి. టీటీడీ బోర్డు సభ్యుడిగా కూడా అవకాశం కల్పించారు. ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయండి.. పదవులు వాటంతట అవే వస్తాయి. అందుకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు నిదర్శనం.

అందరినీ గౌరవించే వ్యక్తి సోమిశెట్టి

• బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత నాగార్జునరెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అందరివారు అని, అందరినీ గౌరవిస్తారని బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జునరెడ్డి కొనియాడారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జున రెడ్డి హాజరై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన సోమిశెట్టిని సన్మానించారు. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సోమిశెట్టి ఎంతో కృషి, పట్టుదలతో ఉన్న పదవులు అలంకరించారన్నారు. ఆయన దగ్గరికి ఎవరు వెళ్లినా మర్యాపూర్వకంగా పలకరిస్తారని కొనియాడారు. అలాంటి గొప్పవ్యక్తి మరిన్ని పదవులు అలంకరించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



సోమిశెట్టికి జ్ఞాపికను ఇస్తున్న నాగార్జునరెడ్డి



మంత్రి టీజీ భరత్‌తో మాట్లాడుతున్న బత్తుల నాగార్జునరెడ్డి

ఐడీఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కిషోర్ కుమార్



కర్నూలు హాస్పిటల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షునిగా నంద్యాలకు చెందిన సీనియర్ దంత వైద్యులు డా.కే.కిషోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఐడీఏ రాయలసీమ కర్నూలు, నంద్యాల జిల్లాల దంత వైద్యుల వార్షిక సమావేశం కర్నూలులోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఐడీఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా డా.పరమేశ్వరరెడ్డి, డా.దత్తసాయి కిరణ్; డా.సతీష్, ట్రెజరర్‌గా డా.సందీప్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐడీఏ జిల్లా సెక్రటరీ డా.రాయపురామ చంద్రరెడ్డి, మాజీ అధ్యక్షులు డా.ఉపేంద్రనాథ్ రెడ్డి, డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, డా.నాగలక్ష్మిరెడ్డి, డా.నరేష్‌గౌడు, డా.నౌషాద్ పాల్గొన్నారు.

పెరుగుతున్న పత్తి ధరలు



ఆదోనిలో విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

• క్వింటాలు రూ.7,308

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు పెరుగుతున్నాయి. సోమవారం మళ్లీ పత్తి ధర స్వల్పంగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు పత్తి గరిష్ఠంగా రూ.7,308 పలికింది. గత వారం కంటే క్వింటాలు పత్తి ధర రూ.300పైగా ధర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ దూది, గింజల ధరలు పెరగడం వల్ల స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు పేర్కొన్నారు. 6018 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,599, గరిష్ఠ ధర రూ.7,308, మధ్య ధర రూ.7,149 పలికింది.

బైక్‌పై నుంచి కింద పడి మహిళ మృతి

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కింద పడి ఓ మహిళ మృతి చెందింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంకు చెందిన రామాంజనేయులు-శివలక్ష్మి దంపతులు దిగువ అహోబిళంలోని రాణప్రాసన్న ఆశ్రమం కాపలాదారులుగా ఉంటున్నారు. కార్తీక సోమవారం కావడంతో బండిఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రానికి కోడలు మాసమ్మతో కలిసి బైక్‌పై బయలుదేరారు. నరసాపురం గ్రామ సమీపంలోని కుంట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో శివలక్ష్మి 36) బైక్‌పై నుంచి రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై ఎగిరి పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొని కోడలు మాసమ్మ, రామాంజనేయులు గాయపడ్డారు. అలాగే మరో బైక్‌పై ఉన్న ముకుందాపురానికి చెందిన సుందర్‌రావు, శ్వేత అనే మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. వీరిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

రహదారిపై వరి ధాన్యం ఆరబోయడం వల్లే..

రహదారిపై వరి ధాన్యం ఆరబోశారు. రెండు వరుసల రహదారిలో ఒక వరుసలో వరి ధాన్యం ఆరబోశారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే తరుణంలో ఆళ్లగడ్డ నుంచి అహోబిళం వెళుతున్న కారును తప్పించబోగా ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అటు అధికారులు చర్యలు తీసుకుని రహదారిపై ధాన్యం ఆరబోతను అరికట్టాల్సిన అవసరం ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

• దంపతులను కబళించిన ప్రమాదం



చంద్రశేఖర్, ఈశ్వరమ్మ (ఫైల్)

శిరివెళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఈశ్వరమ్మ (60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య సోమవారం తెలిపారు. అరుణాచలం నుంచి కర్నూలుకు వెళ్తున్న కారును శిరివెళ్లకు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన ఈశ్వరమ్మ, రవి కుమార్‌లను చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. వీరిలో ఈశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆమె కోలుకోలేక మృతి చెందారు. కర్నూలులోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఎస్ఐ చంద్రశేఖర్ ఘటన రోజే మృతి చెందగా ఆయన భార్య ఈశ్వరమ్మ సోమవారం ఉదయం మృతి చెందారు. భార్యాభర్తలిద్దరూ గంటల వ్యవధిలో మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంతో నిండిపోయింది. మృతుల కుమారుడు రవి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ సోదాలో ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష పడింది. సోమవారం పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఉప్పరపేటకు చెందిన కందమురి శివకుమార్, బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన కె. రంగస్వామి అనే వ్యక్తులను అరెస్టు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్. రామభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచినట్లు నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపారు. వారికి రెండురోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

నల్లమల్ల పల్లెలకు విద్యుత్ వెలుగులు

• క్షేత్ర స్థాయి సందర్శన చేసిన జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది ఒడ్డున ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలోని నీటి ముంపు గ్రామాల ప్రజలకు త్వరలో విద్యుత్ వెలుగులు రానున్నాయి. నాలుగున్నర దశాబ్దాల కాలంగా చిమ్మ చీకటిలో మగ్గుతున్న కొత్తపల్లి మండలంలోని సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం వాసులకు మహర్దశ రానుంది. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్, ఆత్మకూరు ఏడీ రామసుబ్రహ్మణ్యం, డీఈ జయశంకర్, ఏఈ అబ్దుల్ హబీద్‌లు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుధాకర్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు రూ.96 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు సుమారు 7 కి.మీల మేర 278 విద్యుత్ పోల్స్ అవసరం ఉన్నట్లు చెప్పారు. అలాగే 11 కేవీ లైన్‌తోపాటు నాలుగు సింగిల్ ఫేజ్ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటి భూమి పూజ కోసం నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు మంగళవారం హాజరు కానున్నారని తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో 3, 6వ రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి జనవరి 7 వరకు కొనసాగే పరీక్షలను రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడుతో కలిసి పరిశీలించారు.

3వ సెమిస్టర్ పరీక్షల్లో 224కు 223, సప్లిమెంటరీలో 74కు 74, 6వ సెమిస్టర్ పరీక్షలకు గాను 167కు 167 మంది సప్లిమెంటరీ పరీక్షలకు 3 దరఖాస్తు చేసుకోగా ముగ్గురు హాజరయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం



గంజాయి మొక్కలను కాల్చేస్తున్న కౌతాళం సీఐ అశోక్ కుమార్

కౌతాళం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడూరు గ్రామంలో 183 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, ఎక్సైజ్ అధికారులతో కలిసి రౌడూరు గ్రామంలోని సర్వే. నెం 391లో గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్య, రఘువర్ధన్ రెడ్డి, మాల వీరేష్ సాగు చేస్తున్న పొలం నుంచి 183 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని 182 మొక్కలను పంచాయితీదారుల సమక్షంలో పొలంలో కాల్చేశామని ఒక గంజాయి మొక్కను శాంపుల్ నిమిత్తం స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

• అంకిరెడ్డిపల్లెలో విషాదం

కొలిమిగుండ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విచిత్రంగా హెయిర్ కటింగ్ చేయించుకున్నాడని పెంపుడు తల్లిదండ్రులు మందలిం చారని విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన వడ్డె పెద్దిరాజు, షేక్‌మాబీ దంపతులు తాడిపత్రికి చెందిన మాబీ సోదరి కుమారుడు దూదేకుల సిద్ధిబాషాను(12) చిన్నప్పటి నుండి పెంచుకుంటున్నారు. సిద్ధిబాషా తాడిపత్రిలోని శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రతి రోజు అంకిరెడ్డిపల్లె నుంచి బస్సులో పాఠశాలకు వెళ్లి వచ్చే సిద్ధిబాషా సోమవారం సెలూన్ షాపుకు వెళ్లి విచిత్రమైన పద్ధతిలో కటింగ్ చేయించుకున్నాడు. పాఠశాలకు వెళ్లడానికి ఇది బాగుండదని, తిరిగి మామూలు పద్ధతిలో కటింగ్ చేయించుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో బాషా ఆవేశంతో ఇంటి పైన ఉన్న రూములోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకు న్నాడు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

● రూ.2.15 లక్షల నగదు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

ఆదోని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మట్కా నిర్వహిస్తున్న బీటర్లను సోమవారం మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సోమన్న వివరాల మేరకు... కమ్మరచేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి బళ్లారిలో నివాసం ఉంటూ పటణంలోని హవన్న పేటకు చెందిన షేక్ చకోలి చాంద్ బాషాతో కలిసి మట్కా నిర్వహిస్తున్నారన్నారు. పోలీసులు పట్టణ శివారు ప్రాంతమైన ఆస్పరి రహదారిలోని ఎంజీ బ్రదర్స్ వెంచర్‌లో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.2,15,600 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వీరితోపాటు మున్సి ఆలీ హుస్సేన్, ఈరప్పల నుంచి 15 లీటర్ల నాటు సారా, రూ.35,500 నగదును సీజ్ చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని రిమాండ్ తరలించామన్నారు.

కారు, బైకు ఢీ

• ముగ్గురికి గాయాలు

మహానంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం శ్రీనగరం- అల్లీనగరం గ్రామాల మధ్య సోమవారం కారు- మోటర్ బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది ఆలయానికి కార్తీక మాసం పురస్కరించుకొని దర్శనాకి వచ్చి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్న నంద్యాల మండలం సాంబవరం గ్రామానికి చెందిన నాగచంద్రుడు, నాగమోహన్, సురేంద్ర అనే ముగ్గురు యువకుల బైక్‌ను అల్లీనగరం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు టైరు పగిలి కొట్టింది. బైక్ మీద వస్తున్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు: మంత్రి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం ఎస్‌ఏపీ క్యాంపులో నూతన రహదారి నిర్మించనున్న ప్రదేశాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ చౌరస్తా కూడలిలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను చౌరస్తా సమీపంలో ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోకి వాహనాలను మళ్లించేందుకు రహదారి నిర్మాణా నికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 40 అడుగుల వెడల్పు, 116 మీటర్ల పొడవుతో రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే కిడ్స్ వరల్డ్ సర్కిల్ నుంచి ఉస్మానియ కళాశాల, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకు, అలాగే అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర స్వామి మఠం వరకు రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం నుంచి జమ్మిచెట్టు వరకు హంద్రీ నది తీరాన బంక్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకొనున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి వెంట నగర పాలక కమిషనర్ ఎస్.రవీం ద్రబాబు, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల షెడ్యూల్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల షెడ్యూల్‌ను ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు ఎస్.గిడ్డయ్య, పి.శ్రీనాథ్‌లు సోమవారం ప్రకటించారు. అండర్-17 బాలుర రగ్బీ గుంటూరులో జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరుగును. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27వ తేదీన కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలోని కార్యాలయంలో సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘవేంద్రకు రిపోర్టు చేయాలి. అలాగే అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలికలకు ఈ నెల 28, 29 తేదీల్లో కాకినాడ జిల్లా కదులూరు మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగును. ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27న ఉదయం 9 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.శేఖర్‌కు రిపోర్టు చేయాలి. అలాగే అండర్-14 బాలుర క్రికెట్ పోటీలకు ఈ నెల 28, 29 30 తేదీల్లో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని అమలాపురం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరుగును. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27న డీఎస్‌ఏ స్టేడియంలో బి.శేఖర్‌కు రిపోర్టు చేయాలని వారు తెలిపారు.

శివ నామస్మరణతో మార్మోగిన కాల్వబుగ్గ

ఓర్వకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కోనేటిలో స్నానాలు చేసి శివునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మినరసింహ శర్మ పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, హుశేనాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే చిన్న కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేశారు.





కాల్వబుగ్గలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు, దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని నగరంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించారు. నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో, సప్తగిరి నగర్‌లోని కొత్త అయ్యప్ప స్వామి ఆలయంలో, కేసీ కెనాల్ సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో, వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో, పాతనగరంలోని శివాలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలను నిర్వహించారు.







సప్తగిరినగర్‌లోని అయ్యప్ప, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, శివాలయంలో కార్తీక పూజలు చేస్తున్న భక్తులు

'కుడా' చైర్మన్‌కు సన్మానం

కర్నూలు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు లోని ఎమ్మార్సీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, టీజీ భరత్ హాజరయ్యారు. ఈసందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ చేసిన అనంతరం సోమిశెట్టి, కేఈ, టీజీ భరత్, ఫరూక్‌ను కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు సయ్యద్, సోఫీబేగ్, అస్లాంబాషా భారీ గజమాలతో సత్కరించారు. ఈకార్యక్రమానికి కర్నూలు రూరల్, కోడు మూరు, గూడూరు, బెళగల్ మండలం నుంచి టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సోమిశెట్టికి కుడా చైర్మెన్ పదవి దక్కడంతో మరికొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

కర్నూలు అర్బన్: కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు. మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, టీజీ భరత్, పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తిలను కర్నూలు రూరల్ మండల అధ్యక్షుడు ఐటీడీపీ అధ్యక్షుడు సయ్యద్ బాషా గజమాలతో సత్కరించారు. అనంతరం వారికి పూల బొకే ఇచ్చి అభినందించారు.



సోమిశెట్టి, కేఈ, ఫరూక్, టీజీ భరత్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా బ్రాహ్మణ కార్తీక వన భోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం ఘనంగా జరిగింది. సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నగరంతోపాటూ చుట్టుపక్కల మండలాలకు చెందిన బ్రాహ్మణులు వందల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆసు పత్రి సహకారంతో పేద వర్గాలకు చెందిన బ్రాహ్మణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి వారికి అర్చనలు నిర్వహించారు. ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దామోదర పూజలు చేశారు. ఈ సందర్భంగా నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లోని బ్రాహ్మణులంతా ఒక చోట చేర్చి వారి మధ్య పర స్పర స్నేహసంబంధాలు, సేవా సహకార గుణాలు పెంపొందించేందుకు ఈ కార్తీక వనభోజన కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు చెరువు దుర్గాప్రసాద్, నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు కంచు గంటల శ్యామసుందర శాస్త్రి, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, ఇతర ప్రతినిధులు సీఎస్ ప్రసాదరావు, సముద్రాల శ్రీధర్, టీవీ రవిచంద్రశర్మ, ఫణి, పద్మనాభం, మామిళ్లపల్లి రాజేశ్, ఆయన మేనేజర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.



వనభోజనంలో పాల్గొన్న నగర బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అనుమతులు ఉంటేనే కొళాయి కనెక్షన్లు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు ప్రభుత్వ అనుమతి ఉంటేనే కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాల యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహించారు. ప్రజల నుంచి 21 అర్జీలను కమిషనర్ స్వీకరించారు. వివిధ కాలనీలకు చెందిన వారు తమ కాలనీలో కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం గత వైసీపీ ప్రభుత్వంలోని బేతపల్లి గ్రామంలో పని చేసిన వీఆర్వో, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు బేతపల్లి రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశ పారంపర్యంగా వస్తున్న భూమి సర్వే 363, 457, 780, 788, 789లను ఇతరులకు నమోదు చేశారన్నారు. కోటి, శేషగౌడు, హరికృష్ణ పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం

కర్నూలు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. నవచైతన్యం జెండర్ కార్యక్రమంలో భాగంగా కోర్ కమిటీ సమావేశం ఏర్పాట చేసినట్లు ఎంపీడీవో రఘునాథ్ తెలిపారు. గ్రామస్థాయిలో లింగవివక్ష, బాలికల విద్య, బాల్యవివాహాలు, గృహహింస అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ఎంఈవో, వైద్యాధికారి ఏపీఎం, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: తహసీల్దార్

సి.బెళగల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వీఆర్వోలను హెచ్చరించారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ గ్రామాల్లోని వీఆర్వోలు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

నేటి నుంచి రామదాసు స్వామి తిరుణాల

కోడుమూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో వెలసిన రామదాసుస్వామి వార్షిక తిరుణాల మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈనెల 26న అభిషేకం, ఆకుపూజ, పల్లకిసేవ, 27న నందికోల సేవ, 28న రామదాసుస్వామి రథోత్సవం, 29న అశ్వవాహన సేవ, 30న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

మహిళలను వేధిస్తే చర్యలు: ఎంపీడీవో

సి.బెళగల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సర్పంచ్ ఎండీ పొండు రంగన్న అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలపై వివక్షత చూపిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎంఈవో జ్యోతి, ఏపీవో రామన్న, వెలుగు ఎంపీఎం రమేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కర్నూలు హస్పిటల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు వైద్య విద్యార్థులు దూరంగా ఉండాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సి పాల్ కే.చిట్టినరసమ్మ అన్నారు. సోమవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ రాజ్‌విహార్ మెన్స్ హాస్టల్‌లో వైద్యవిద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సూపరిం టెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రేణుకాదేవి, సాయిసుధీర్, విజయానందబాబు, మెన్స్ హాస్టల్ వార్డెన్ నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ సోమశేఖర్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

గూడూరు నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు భరోసాను ఇస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. సోమవారం గూడూరు మండలంలోని కె నాగలాపురం గ్రామంలో జె సురేష్ అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జె సురేష్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం చేసుకోవడం వలన ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్, రవి, నాగ సుంకన్న, గౌస్ మల్లికార్జున, ఎల్లయ్య పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం'

కర్నూలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరి రక్షించుకుందామని సమాచార హక్కు పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌కే జయన్న అన్నారు. సోమవారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, రాముడు, నాగప్ప, శేషమ్మ, క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

బీడి కార్మికులకు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీడి కార్మికులు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. సోమవారం జొహరాపురం పరిధిలోని వెంకాయపల్లి, బీడి కార్మికుల ఇళ్ల స్థలాలకు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలని కోరుతూ లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ బీడి కార్మికుల స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రాజ శేఖర్, కే.రామక్రిష్ణ, రాముడు అబ్దుల్ నయీమ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు: ఎస్‌ఐ

సి.బెళగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ తిమ్మారెడ్డి పోలీసులకు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను తీసుకుని సమస్యలను పరిస్కారానికి కృషి చేయాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈసమావేశంలో ఏఎస్‌లు, హెడ్ కానిస్టేబుల్, పోలీసులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి



ఎమ్మెల్యే గౌరు చరితకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ, అధికార సంఘాల ప్రతినిధులు విశ్రాంత మేనేజర్ గౌరు సాంబశివారెడ్డి కోరారు. సోమవారం సంఘ నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను ఆమె స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిపి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలోనే కొనసాగించేలా విన్నవించారు. కార్యక్రమంలో హరిప్రసన్న, జగదీశ్వర్ రెడ్డి, ఏపీజీబీ బ్యాంక్ ఆఫీసర్స్ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలు వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమ వారం రామకృష్ణతోపాటు రైతు సంఘం ప్రతినిధులు నాగేష్ పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ప్రజాదర్బార్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. నాటి వైసీపీ ప్రభుత్వం ఆ కంపెనీ యజమాన్యానికి వత్తాసు పలకడం వల్లనే ఐదేళ్లయినా ఆ కంపెనీ విత్తనాలను వాడి నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆరోపించారు. రైతులు కష్టాల్లో ఉన్నారని, కూటమి ప్రభుత్వమైనా ఆ కంపెనీ నుంచి పరిహారాన్ని రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిసెంబరు 31లోపు పరిష్కరించండి: జేసీ

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో వచ్చిన రీసర్వే అర్జీలను డిసెంబరు 31లోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రెవెన్యూ అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే అర్జీలలో ఎక్కువగా ఎక్సటెన్ట్ వేరియేషన్, జాయింట్ ఎల్‌పీఎం దరఖాస్తులు ఉన్నాయన్నారు. జాయింట్ ఎల్‌పీఎం, బౌండరీ వేరియేషన్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా ఉన్న ఇనామ్ భూ సమస్యలను కూడా తగిన ఫార్మాట్‌లో పంపించాలన్నారు. సివిల్ సప్లయ్స్‌కి సంబంధించి రేషనలైజేషన్ ఆఫ్ఎఫ్‌పీ షాప్స్‌కి సంబంధించి కొత్త షాపులకు రోస్టర్ పాయింట్లను ఫిక్స్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్ కుమార్, సర్వేయర్ ఏడీ ముని కన్నన్, డీఈవో శ్యామూల్ పాల్ పాల్గొన్నారు.

తడకనపల్లె చెరువుకు జలకళ

- హంద్రీనీవా కాలువ నుంచి నీరు విడుదల
- పాణ్యం ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికారులు



తడకనపల్లె చెరువులోకి విడుదలవుతున్న నీరు

కల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలోని చెరువు జలకళను సంతరించుకుంది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఇప్పటికే కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి తడకనపల్లె గ్రామ ప్రజలు, రైతులు, మూగజీవాలు పడుతున్న ఇబ్బందులను పలుమార్లు వినతిపత్రం రూపంలో అందించారు. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే ఆదేశా లతో అధికారులు స్పందించి హంద్రీనీవా కాలువ నుంచి చెరువులోకి నీటిని తోడిపోస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటి బోర్లు పనిచేయడం లేదని ప్రజలు, పశువులకు తాగునీటి సమస్య అధికంగా ఉందని చెరు వుకు నీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో చెరువుకు నీరు చేరుతుండటంతో తడకనపల్లె ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచు ఎస్.సహారాబీ ఆధ్వ ర్యంలో పంచాయతీ అధికారులు హంద్రీనీవా కాలువకు మోటార్ల ద్వారా నీరు తోడిపోస్తున్నారు.

● రెండు మోటార్లు అమర్చి: తడకనపల్లె చెరువుకు హంద్రీనీవా కాలువలో రెండు మోటార్లు అమర్చి నీరు విడుదల చేయిస్తున్నట్లు సర్పంచు ఎస్.సహారాబీ తెలిపారు. రెండు 50 హెచ్‌పీ మోటార్ల ద్వారా రోజుకు 21 గంటలు నీరు విడుదల చేస్తున్నామని, ఇప్పటికే దాదాపు రూ.15.50 లక్షల రూపాయల వ్యయం చేసినట్లు ఆమె తెలిపారు. చెరువుకు నీరు నింపడంతో పొలాల్లోని బోర్లు రీచార్జ్ అవుతాయని ప్రజలు, పశువులకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

గూడూరు నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాయలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజల నుంచి అర్జీలు రాగా వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు.

29న జాబ్ మేళా

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి బీసీ ఉలిగన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని న్యాక్ శిక్షణ కేంద్రం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో మేళా ఉంటుందన్నారు. వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రాజశేఖర్, వీరేష్, అమృత్ కుమార్లను లేదా 9908554147, 9397031486 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

'అవకతవకలపై విచారణ చేపట్టాలి'

పత్తికొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన కేంద్రాల్లో అవకతవకలపై విచా రణ చేసి, చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య, కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. లబ్దిదారుల నుంచి రూ.150లు వసూలు చేస్తున్నారన్నారు. నరేష్, సోమన్న పాల్గొన్నారు.

రూ.4 లక్షల విరాళం

ఆలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో నిర్మిస్తున్న 54అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహానికి హోటల్ నిర్వాహకుడు సోడాల వెంకటరాముడు, గోవిందమ్మ దంపతులు రూ.4లక్షలు విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. దలవాయి శ్రీదేవి, వీరాంజినేయులు పాల్గొన్నారు.

అక్రమ గరుసు తవ్వకాలపై నిగ్గు తేల్చాలి

- ఆదోనిలో జర్నలిస్టు సంఘాల నిరసన

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమ గరుసు తవ్వకాలపై నిజాలను నిర్భయంగా రాసిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక విలేకరి రవిపై అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బత్తిని మల్లికార్జున, హుస్సేన్, సీనియర్ నాయకుడు గౌస్ అన్నారు. సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. బీమా సర్కిల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ సోమన్నకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే అక్రమంగా గరుసును తవ్వి, రాయల్టీని చెల్లించకుండా చేస్తూ, వార్త రాసిన విలేఖరిపై కేసు పెట్టడం సరికాదన్నారు. అక్రమాలు చేయలేదని నిరూపించుకోవాలేగాని ఇలా జర్నలిస్టుపై ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దశరథ, రాము, విజయేంద్రనాథ్ ప్రసాద్, చిన్న, రవికుమార్, ముగ్ధుమ్, చార్లెస్ మహేష్ గిరిబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బసవ రాజు, విజయ్ పురుషోత్తం, మునేప్ప, జాప్ నాయకులు సునీల్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవద్దు

ఆదోని టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ, గరుసు తరలింపుపై కథనం రాసిన విలేఖరిపై టీడీపీ నాయకురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం హయాంలో కూడా గరుసు తరలింపుపై పత్రికలలో కథనాలు వచ్చాయని, వారెవరూ విలేఖరులు, పత్రికలపై పోలీసు కేసులను నమోదు చేయించలేదన్నారు. నచ్చని అంశాలుంటే, వివరణ ఇవ్వాలేగానీ కేసులను నమోదు చేయించడం సమంజసం కాదన్నారు. కూటమి రాగానే, పత్రికలు వార్తలు రాయడానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు.

విలేకరులకు స్వేచ్ఛ కల్పించాలి

విలేకరులకు స్వేచ్ఛ కల్పించాలని ప్రభుత్వ ఆస్పత్రుల సలహా సంఘం మాజీ సభ్యుడు, సామాజిక సేవా కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ గరుసు తవ్వకాలపై వార్త రాసిన ఆంధ్రజ్యోతి విలేఖరి రవిపై ఫిర్యాదు చేయడం పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడమే అన్నారు.

'మహిళలను కించపరచవద్దు'

తుగ్గలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరచవద్దని, వారి రక్షణకు పాటుపడాలని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో విశ్వమోహన్, ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. బాల్యవివాహాలను అరికట్టాలని, బాలికలను చదివించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారయత్నాలకు పాల్పడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాధాకృష్ణ, ఏఈ మహేశ్వరరెడ్డి, ఏవో పవన్ కుమార్ ఉన్నారు.

సబ్సిడీ విద్యుత్‌ను సద్వినియోగించుకోవాలి

తుగ్గలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు సబ్సిడీ విద్యుత్‌ను సద్వినియోగించుకోవాలని విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం గిరిజన తండాలు, తుగ్గలిలో ఎస్సీ, ఎస్టీలతో మాట్లాడుతూ 200 యూనిట్లలోపు వినియోగించుకుంటే బిల్లు రాదన్నారు. 200 యూనిట్లు దాటితే రూ.వెయ్యి బిల్లు వస్తుందని, వాటర్ హీటర్లను వాడితే ఎక్కువ యూనిట్లు ఖర్చు అవడత బిల్లు వస్తుందని గమనించాలని కోరారు.

'అధికంగా వసూలు చేస్తే చర్యలు'

మద్దికెర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లలో జనన, మరణ ధృవీకరణ పత్రాలకు అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ హెచ్చరించారు. సోమవారం మాట్లాడుతూ ఆపార్, జనన ధృవీకరణకు రూ.400 నుంచి రూ.600ల వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నాయని, ఇకపై సీజ్ చేస్తామన్నారు. పారా రవికుమార్, వీఆర్వో రంగస్వామి, రషీద్ ఉన్నారు.

దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మిస్తున్న నూతన ఇళ్లలో విద్యుత్ తీగలను కత్తిరించి దొంగలిస్తున్న దుండగులపై చర్యలు తీసుకోవాలని బాధితులు వెంకటేశ్వరరెడ్డి, పరుశురాముడు, లక్ష్మీకాంత, మునెప్ప విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఐ జయన్నకు వినతి పత్రం సమర్పించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లలో అమర్చిన రూ.లక్షలాది విలువ చేసే తీగలను చోరీ చేస్తున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

క్రిష్ణగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు 104 ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం స్వగృహంలో ఎమ్మెల్యేని కలసి తమ సమస్యలను వివరించారు. 2020 తరువాత విధులలో చేరిన వారికి జీవో7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్‌ను చెల్లించాలని కోరారు. యూని యన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఓబులేష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మోజులో జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఆలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మోజులో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ సూచించారు. సోమవారం కళాశాలలో సామాజిక మాధ్యమం లాభ నష్టాలు అంశంపై సమావేశం నిర్వహించారు. సెల్‌ఫోన్‌తో మానవ సంబంధాలు దెబ్బతింటాయని, పిల్లల నుంచి పెద్దల వరకు సెల్‌నే కాలం గడుపుతున్నారు. యువత చదువుపై దృష్టి పెట్టాలని, అవసరం మేరకే సెల్‌ను ఉపయోగించాలన్నారు. న్యాయవాది రవి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సుశీల, లక్ష్మీ నరసమ్మ, రాఘువేంద్ర, ముద్దప్ప పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి

మద్దికెర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొజ్జనాయునిపేట వీఆర్ఏ సుంకన్న (80) మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. తహసీల్దార్ హుశేన్ సాహెబ్ భౌతిక కాయానికి నివాళి అర్పించి, రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి, టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, టీడీపీ నాయకులు శాంతిరెడ్డి, లాయర్ మండి వీరేష్, పారా రాఘవేంద్ర, ఆనంద్ కుమార్ సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని..

- ఆదోని మండలం నాగనతన హళ్లి గ్రామానికి చెందిన కృష్ణప్ప తనకు సర్వే నెం.288లో 1.50ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు ఉందని, మార్చాలని అర్జీ ఇచ్చారు.
- మంత్రాలయం మండల మాలపల్లి గ్రామానికి చెందిన దుల్లయ్యకు సంబంధించి సర్వేనెంబర్ 15,13లో 14.33ఎకరాల భూమి ఉందని, అయితే దారిని ఆక్రమించారని న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- గోనెగండ్ల మండలం పెద్ద నేలటూరు గ్రామానికి చెందిన లింగన్న తనకు సర్వే నెం. 185/4లో 1.98 181/3లో 0.50ఎకరాలు, 183లో 1.60 ఎకరాలు, 184లో 0.35ఎకరాలు, 4.43 ఉందని, ఆన్‌లైన్ చేయలని కోరారు.
- పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న గ్రంథాలయం పరిసరాల్లో పారిశుధ్య పనులు చేయించాలని పాఠకులు అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో సర్వాయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్‌డీపీవో, నూర్జహాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, హౌసింగ్ డీఈ రవి కుమార్, డీఈ వెంకటేశ్వరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- వైకుంఠం శివ ప్రసాద్, జ్యోతి


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ఆలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం రాత్రి ఆలూరు మండలంలోని ఎం కొట్టాల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవడం వల్ల టీడీపీ అధిష్ఠానం మేలు చేస్తుందన్నారు. అనంతరం స్థానిక సీఎస్ఐ చర్చిలో సపోజ్ క్రిస్మస్ వేడుకలల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, టీడీపీ నాయకులు సీనప్ప, రామాంజినేయులు, ఆనంద్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఆదోని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు రణమండల కొండలో వెలిసిన రణమండల ఆంజనేయ స్వామి ఆలయానికి కలశ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. నిర్వాకుడు టీజీ పాండురంగయ్య శెట్టి, కార్యక్రమ నిర్వాకుడు ఏటీఎం 'శివ ఆధ్వర్యంలో గోపురానికి కళసస్థాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు.

పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచాలి: ఎంఈవో


రికార్డును పరిశీలిస్తున్న ఎంఈవో చిరంజీవి రెడ్డి

ఆలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు శ్రద్ధ చూపాలని ఆలూరు ఎంఈవో-2 చిరంజీవి రెడ్డి వార్డెన్ సుధారాణికి సూచించారు. సోమవారం ఆలూరు మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేసి భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ఉపయోగించుకొని చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం ఎంఈవో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

వైభవంగా లక్ష దీపోత్సవం


మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

వెల్దుర్తి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ దంపతులు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఇస్కాన్ కృష్ణ చైతన్య సంఘం రూపేశ్వర చైతన్యదాస్, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పుష్పావతి పాల్గొన్నారు.

ఊరు వాకిలి పనులు ప్రారంభం

ఆస్పరి , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఊరు వాకిలి నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ మూలింటి రాధమ్మ, జడ్పీటీసీ దొరబాబు, వైస్ ఎంపీపీ లింగమ్మ ప్రారంభించారు. రూ.30లక్షల పంచాయతీ నిధులతో పనులు చేస్తున్నట్లు సర్పంచ్ రాధమ్మ తెలిపారు. గ్రామపెద్దలు మూల ఇంటి రాఘవేంద్ర, ఎస్ తిమ్మన్న, దత్తాత్రేయ రెడ్డి, ఎంపీపీ భర్త రామాంజినేయులు, సీఐ మస్తాన్ వలి,, సతీష్ కుమార్ బీజేపీ ఆలూరు ఇన్‌చార్జి వెంకటరాముడు, జనసేన కార్యదర్శి అరవింద్, మేకల రంగనాయకులు పాల్గొన్నారు.

సార్లూ..! ఇలా చేశారేంటి?

- ప్రజా పరిష్కార వేదికకు రాని అధికారులు
- హొళగుందలో రైతులు, విద్యార్థుల పడిగాపులు


ఎంపీడీవో కార్యాలయంలో 11గంటలకు అధికారులు లేని ప్రజా పరిష్కార వేదిక

హొళగుంద , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఉదయం 10గంటలకు 16 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉంది. అయితే హొళగుందలో ఏ ఒక్క అధికారి హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 11:05 నిమిషాలకు తహసీల్దార్, ఎంపీడీవో మాత్రమే హాజరయ్యారు. తమ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఎదురుచూసి చేసేదేమీ లేక చెట్ల కింద కూర్చుండిపోయారు. ఎంతో ప్రయాసతో ఇక్కడకు వస్తే అధికారులు నిర్లక్ష్యం చేశారని రైతులు, విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా ఉన్నత అధికారుల అనుమతి మేరకు గంట ఆలస్యంగా వచ్చానని, మిగతావారి విషయం తనకు తెలియదన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

ఎమ్మిగనూరు/ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు కార్తీక దీపో త్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మహిళలు, చిన్నారులు తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. మండలంలోని గుడికల్లు గ్రామంలో వెలసిన శివాలయంలో మహిళలు 10 వేల దీపాలను వెలిగించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం, మాధవరం,



ఎర్రకోటలో ఉమామహేశ్వరస్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాంపురం తదితర గ్రామాల్లో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాల వద్ద భక్తజన సందడిగా మారింది. స్వామివారికి మహారుద్రాభిషేకం, మారేడు తులసిదళాలతో బిల్వార్చన, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకాలు, 108 మారేడు దళాలతో అభిషేకాలు నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం మహిళలు కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయాల వద్ద గ్రామ ప్రజలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించారు.

నందవరం: మండలంలోని పూలచింతలో బండేగురు స్వామి ఆలయంలో శివలింగానికి, బుండే గురుస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో మహిళలు ప్రత్యేకంగా కార్తీక పూజలు చేశారు. ఆలయ ఉప పీఠాధిపతి బండేగురుస్వామి, అక్కామాంబాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో దీపోత్సవాలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు: కార్తీకమాసం సందర్భంగా మండలంలోని ఎర్రకోట గ్రామంలో కట్టకింద ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉమామహేశ్వర వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివయ్యస్వామి ఆధ్వర్యంలో ఉమామహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



పూలచింతలో పూజలందుకున్న శివలింగం



శివలింగాకారంలో దీపాలంకరణ

సోమిశెట్టి ప్రమాణ స్వీకారానికి తరలిన తెలుగు తమ్ముళ్లు



ఎమ్మెల్యేతో పాటు కర్నూలుకు బయలుదేరుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కుడా ఛైర్మన్‌గా నియమితులైన సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారోత్సవానికి కర్నూలుకు తెలుగుతమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 20వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలను జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. కర్నూలులో సోమిశెట్టి ప్రమాణ స్వీకారంలో పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాచాని శివశంకర్, నాగరాజు, రంగస్వామి గౌడ్, సూరి, మహేష్, మలయ్య, వెంకటేశ్వర్లు, అబ్దుల్, ఈరన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోండి

మంత్రాలయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని చిలకలడోన ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. పల్లె పండుగలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల పనులు కాంట్రాక్టర్ పూర్తికాకుండానే మధ్యలో వదిలేశారని ఆరోపిస్తున్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు తిమోతి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఉదయం యథావిధిగా విధులకు వెళ్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపోగా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. తిమోతికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మానవత దృక్పథంతో మున్సిపల్ కమిషనరు రూ15వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్తీక సోమవారం పర్వ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవ రాయడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవలో ఉత్సవమూర్తిని అధిష్ఠించి ఊయలలో ఊగించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మఠంలో పూజలు బంద్: రాఘవేంద్రస్వామి మఠంలో ఏకాదశని పురస్కరించుకొని మంగళవారం బృందావనానికి జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం వితరణ చేశారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇవ్వనున్నారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే మఠం అధికారులు కల్పించనున్నారు.



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

చంద్ర పుల్లారెడ్డికి నివాళి



చంద్ర పుల్లారెడ్డికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రైతు కూలీ సంఘం నియోజకవర్గ నాయకులు దావీదు, శ్యాంసన్ అధ్యక్షతన సోమవారం మండలంలోని ఏనుగుబాల గ్రామంలో చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభ నిర్వహించారు. భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ మాట్లాడుతూ దోపిడీ పీడిత వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన చంద్ర పుల్లారెడ్డి, కార్మిక కర్షక విద్యార్థి ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటలు చేసి రామన్న గౌడ్, హనుమంతు అమరులయ్యారని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మనువాదం, మతోన్మాదంతో అధికారంలో వచ్చి పేదల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్మికుల త్యాగంతో సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్ యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ కార్మిక హక్కులను హరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి మోసగించిందన్నారు. కార్యక్రమంలో ఎర్రన్న, ఎల్లప్ప, పెద్ద రత్నం, కమలాకర్, ఫరీద్ పాల్గొన్నారు.

మిరప రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని మిరప రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శ్రీనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అధికశాతం రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారన్నారు. అయితే ఈ ఏడాది మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మిరప రైతులకు రూ.25వేల మద్దతు ధరను కల్పించాలన్నారు. 2022-23 ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని వెంటనే రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ మొత్తాన్ని అందజేయాలన్నారు. పెద్దకడుబూరును కరువు మండలంగా ప్రకటించారన్నారు. ఎల్లెల్సీ కాలువ నీటిని రబీ సీజన్‌కు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలన్నారు. బోరు మోటారులకు స్మార్ట్ మీటర్లు బిగించరాదన్నారు. ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేసి ఆత్మహత్యలు నివారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, ఈరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

మంత్రాలయం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం ఆదివారం మధ్య రాత్రి జరిగింది. కర్నూలులో పనులు ముగించుకుని కారులో తిరిగి వస్తుండగా.. కల్లుదేవకుంట గ్రామ సమీపంలో కుక్క అడ్డువచ్చింది. దాంతో కారు బోల్తా పడింది. ఈ కారులో ఉన్న రాఘవేంద్రస్వామి మఠం ఎస్టేట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, గోనెగండ్ల ఆర్ఐ జనార్దన్‌రావు, ఆదోని డ్రైవర్ మల్లికార్జునకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి: సీఐ

మంత్రాలయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య రాకుండా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని సీఐ రామాంజులు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ పరమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్యపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని ఆటోలు, ట్రాక్టర్లు, వాహనాల రికార్డులను తనిఖీలు చేసి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో సిబ్బంది రామకృష్ణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులు సమానమే

నందవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీలు, పురుషులు సమానమేనని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ స్త్రీల హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం నందవరంలో సమావేశాన్ని నిర్వహించారు. మహిళలపై నిత్యం దాడులు జరుగుతున్నాయన్నారు. మనోస్థైర్యాన్ని కోల్పోకుండా నిర్భయంగా పిర్యాదు చేయాలన్నారు. మహిళల హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. భావితరాలు నిలబడాలంటే స్త్రీలను గౌరవించాలన్నారు. సమావేశంలో మల్లేషప్ప, నాగసుదర్శన్‌రెడ్డి, బాబు, ధనుంజయ్ పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

పెద్దకడబూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈవో-2 రామ్మూర్తి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం వంట ఏజెన్సీతో మాట్లాడుతూ వంటలో నాణ్యతను పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.





వీఆర్వోలు, సర్వేయర్ల పాత్ర కీలకం

మంత్రాలయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూ రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకు గ్రామ వీఆర్వోలు, సర్వేయర్ల పాత్రనే కీలకమని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో భూరీసర్వే జరిగిన గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భూమి కొలతలు, సరిహద్దులు, అవకతవకల తారుమారుపై అర్జీలు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు సరస్వతి, జీకే గురురాజారావు, ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వోలు నరసప్ప, ఆనంద్, శ్వేత, భీమన్నగౌడు, భీముడు, ఎల్‌కే శ్వేత, ప్రభాకర్, రాజు, హరిత, పుష్పలత, నాగేష్, సర్వేయర్లు తిమ్మేష్, నవీన్, ఉరుకుందాచారి, శోభ, హేమచంద్ర, భవిత, రాధారాణి, భీరప్ప, నాగమణి, రెడ్డి శేఖర్ నాయక్, అనూష, జేఎన్‌బీ ధరణి, కీర్తిలు పాల్గొన్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్

మంత్రాలయం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, మాధవరం, చెట్నహళ్లి, వగరూరు, తుంగభద్ర, మాలపల్లి, రాంపురం గ్రామాల్లో సపోజ్ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ వేడుకలను ఒక నెల ముందుగా జరిగే నవంబరు 25న సోమవారం రాత్రి సీఎస్ఐ చర్చి డివిజనల్ ఛైర్మన్ రెవ.హెచ్. వేదనాయకం, మాధవరం పాస్టర్ జాన్‌వెస్లీ, ఏసయ్య, ఎస్‌డీ రాజన్నల ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననంపై సందేశాన్ని ఇచ్చారు. సంఘ నిర్వాహకులు సురేష్, అశోక్, ఆనోక్, ఇసాక్, జయరాజు, జగన్నాథ్, కుమార్, దేవదాసు, ఖయూన్, దానియేలు, దావీదు, దేవపుత్ర తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి

మంత్రాలయం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం అధ్యక్షుడు అండే శాంతయ్య, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. సోమవారం గంగపుత్రులు ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించకుని కార్తీక వనభోజనం నిర్వహించారు. తుంగభద్ర నది ఒడ్డున వెలసిన గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు, జలాభిషేకలు, హారతులు ఇచ్చి ప్రత్యేక వాహనంపై గంగమ్మ అమ్మవారిని, భీష్మ మహర్షి చిత్రపటాలను ఏర్పాటు చేసి మహిళలు మంగళహారతులు, డీజేలు, డ్రమ్స్ మధ్య శ్రీరామసర్కిల్, రాఘవేంద్ర సర్కిల్ గుండా గోశాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కార్యక్రమంలో అండే హనుమంతు, బొమ్మల శివ, బంగి భీమయ్య, చిన్న సుంకప్ప, నరసింహ, కంతం నరసింహులు, చిన్న భీమ, సున్నం రాఘవేంద్ర, రామకృష్ణ, గంగ పుత్రులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజారమేష్, కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మన్న, చెన్నప్ప డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుమాల ఆంథోని, రాజు, నరసప్ప, అరుణ్, దేవేంద్ర, నాగరాజు, గోవిందు, ఈరన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.





